
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 17। జూన్। 2025



సోమశిలలో 37.490 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 37.490 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 1075 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.1,02,850
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.9,305
3శాతం జీఎస్టీతో	రూ.9,584
సవర (8గ్రా)	రూ.76,672

గరిష్టం/కనిష్టం
36.1 /26.1

వాతావరణం

వాతావరణంలో తేమ 47 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా మంగళవారం అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రామతీర్థం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



కోవూరు: జిల్లాలోని శైవ క్షేత్రాల్లో అతిపురాతన, ఎంతో ప్రాశస్త్యం కలిగిన విడవలూరు మండలం రామతీర్థంలోని కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలకు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవ వివరాలు

17న ధ్వజారోహణం, శేషవాహనోత్సవం, 18న చిలక వాహనం, 19న హంస వాహనం, 20న పులి వాహనం, 21న రావణసేవ, 22న నందిసేవ, 23న రథోత్సవం, 24న కల్యాణోత్సవం, గజవాహనోత్సవం నిర్వహించనున్నారు. 25న ముఖ్య ఘట్టం తీర్థవాది (సముద్రస్నానం), రాత్రికి తెప్పోత్సవం, అశ్వవాహన సేవ, 26న ధ్వజావరోహణ, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన రథోత్సవం, కల్యాణోత్సవం, తీర్థవాది ఘట్టాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

ఐఅండ్‌పీఆర్ డీడీగా శివశంకర్



డీడీగా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్

నెల్లూరు(అర్బన్): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐఅండ్‌పీఆర్) డీడీగా అదే శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ శివ శంకర్‌రావుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన కలెక్టరేట్ ఆవరణంలోని ఐఅండ్ పీఆర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీడీగా పనిచేసిన సదాశివరావు విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. నూతన డీడీ శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు, జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణ

సాక్షి ఎఫెక్ట్..

సీతారామపురం : మండలంలో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోల ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించి పంపిణీ చేయడంపై సమగ్ర విచారణ చేపడుతున్నామని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. సీతారామపురంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారంపై 'సాక్షి'లో సోమవారం కథనం వెలువడిన విషయం తెలిసిందే. అందుకు స్పందించిన తహసీల్దార్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, సూత్ర, పాత్రధారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. నకిలీ పట్టాలపై నిశితంగా విచారణ చేపడుతున్నామని, త్వరలోనే సూత్రధారులను పట్టుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే నకిలీ ఇళ్ల పట్టాల తయారీదారులపై ప్రత్యేక దృష్టి సారించి రహస్య విచారణ జరుపుతున్నామన్నారు. కార్యాలయ స్టాంపులు నకిలీ ఇళ్ల పట్టాలపై ఎలా వేశారన్న దానిపైన, ఈ వ్యవహారంలో కార్యాలయ సిబ్బంది పాత్రపై కూడా విచారణ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు మాయగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని సూచించారు.

ఫేక్‌కాల్స్ నమ్మి పన్నుల చెల్లింపులు చేయొద్దు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పన్నులను క్యూఆర్ కోడ్ ద్వారా సులభతరంగా చెల్లించొచ్చు అంటూ కొందరు ఆగంతకులు ఫేక్‌కాల్స్ చేసి ప్రజలను మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి కాల్స్‌ను నమ్మి చెల్లింపులు చేసి మోసపోవద్దని కమిషనర్ వైఓ నందన్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల పొగతోటలోని ఓ ఆస్పత్రిని ఆగంతకులు ఫేక్ కాల్ ద్వారా సంప్రదించి, ట్రేడ్ లైసెన్స్‌ను తాము పంపుతున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభతరంగా చెల్లించాలని కోరడం జరిగిందన్నారు. ఆస్పత్రి నిర్వాహకులకు అనుమానం వచ్చి తమ దృష్టికి తీసుకొచ్చారని కమిషనర్ వివరించారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన అన్ని పన్నులను ప్రధాన కార్యాలయంతో పాటు స్థానిక సచివాలయాల్లోనూ, అదేవిధంగా ఆన్‌లైన్ విధానంలోనూ చెల్లించవచ్చని తెలిపారు. గుర్తుతెలియని ఆగంతకులు ఫోన్ చేసి క్యూఆర్ కోడ్ తదితర మాధ్యమాల ద్వారా చెల్లింపులు చేయమని డిమాండ్ చేస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004251113 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

జిల్లాలో చెలరేగిపోతున్న పచ్చ మాఫియా

- యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- నిత్యం తవ్వి.. వందల వాహనాల్లో తరలింపు

అధికారం అండ.. గ్రావెల్ దందా



జిల్లాలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. చెరువులు, ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని గ్రావెల్ దందా సాగిస్తోంది. అధికారం అండతో రేయింబవళ్లు గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తూ కోట్లాది రూపాయలు జేబుల్లో వేసుకుంటోంది. సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సర్వేపల్లి పంచాయతీ నాగబొట్లకండ్రికలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వంలో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో కొండలను పిండి చేయడంతో పాటు పొలాలు, చెరువులను అగాధాలుగా మారుస్తున్నారు. ప్రకృతిని ధ్వంసం చేసి కోట్లాది రూపాయలను దోచుకుని జేబులు నింపుకొంటున్నారు. అదే సామాన్యుడు సొంత అవసరాల కోసం తట్టమట్టి కూడా తోలుకునే పరిస్థితి లేదు. గత ప్రభుత్వంలో గ్రావెల్ దందా జరిగిందని గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు ప్రస్తుతం అదే దోపిడీ కొనసాగిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నాయి. జిల్లా అధికారులు సైతం సహజ వనరుల దోపిడీని గుడ్లప్పగించి చూస్తున్నారే తప్పా నిలువరించే ప్రయత్నాలు చేయడం లేదు.

కావలిలో ఆగని దందా

జాతీయ రహదారుల అభివృద్ధి పనుల కోసం కావలి నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే పగలు, రాత్రి తవ్వకాలు సాగిస్తున్నారు. కావలి పెద్దచెరువుతో పాటు రుద్రకోట, అల్లూరు మండలం నార్తుఆములూరు, దగదర్తి మండలం ఉలవపాళ్ల, తదితర ప్రాంతాల్లో గ్రావెల్‌దందా నిర్విరామంగా సాగుతోంది. కావలి మండలం కొత్తపల్లి, తాళ్లపాళెం, చలంచర్ల చెరువులను సైతం గుల్ల చేస్తున్నారు.

సర్వేపల్లిలో భారీ ఎత్తున..

సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాల్లో అధికార పార్టీ నాయకులు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఫిర్యాదులు అందితే కొద్దిరోజులు ఆపి ఆ తర్వాత యథావిధిగా కొనసాగిస్తున్నారు. వెంకటాచలం మండలంలో భారీ ఎత్తున గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ కోట్లాది రూపాయలను జేబుల్లో వేసుకుంటున్నారు. సర్వేపల్లి పంచాయతీ నాగబొట్లకండ్రిక నుంచి అదానీ కృష్ణపట్నం పోర్టుకు స్వయంగా ప్రధాన నాయకుడి కనుసన్నల్లో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార ఒత్తిళ్లతో మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇరిగేషన్ చెరువులే లక్ష్యంగా..

కందుకూరు నియోజకవర్గంలో ఇరిగేషన్ చెరువులు, కుంటలను లక్ష్యంగా చేసుకుని గ్రావెల్ మాఫియా దందా సాగిస్తోంది. అధికార పార్టీ అండదండలతో ఇష్టారీతిన గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ప్రధానంగా ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాళెం, కందుకూరు మండలాల పరిధిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఉలవపాడు మండలంలోని ఇరిగేషన్ చెరువుల నుంచి పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎల్.రాజుపాళెం చెరువులో గ్రావెల్ తవ్వకాలు ఇష్టారీతిన సాగుతున్నాయి. కొందరు ప్రైవేట్ వ్యక్తులు పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేస్తున్నారు. దీని గురించి ఇరిగేషన్ అధికారులు సమాచారం ఉన్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గుడ్లూరు మండలంలోని చెరువుల్లోనూ ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఇరిగేషన్‌శాఖలో పనిచేసే ఓ ఉన్నతాధికారి మట్టిమాఫియాకు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కందుకూరు మండలం కొండికందుకూరులోని కుంట నుంచి పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. స్వయంగా సర్పంచ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడు. అలాగే లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాళెం చెరువు నుంచి అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తాను వేస్తున్న రోడ్డుకు భారీగా మట్టి తవ్వకాలు జరిపాడు. ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి విక్రయించుకుంటున్నారు. అయినా ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అధికార పార్టీ నేతల దయాదాక్షిణ్యాలపై..

ఉదయగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల దయాదాక్షిణ్యాలపైన గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. పేదలు తమ కనీస అవసరాల కోసం గ్రావెల్ తోలుకోవాలన్నా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీ నేతలు మాత్రం రేయింబవళ్లు అనుమతులు లేకుండా లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తూ దోచేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయితీకి గండిపడుతోంది. ఉదయగిరిలోని చెరువుల నుంచి ఇటుకబట్టీలు, లేఅవుట్ల కోసం గ్రావెల్ తరలిస్తున్నారు. దుత్తలూరుతోపాటు నందిపాడు, తదితర గ్రామాల్లో గ్రావెల్ అక్రమ దందా కొనసాగుతోంది. వింజమూరు మండలం పాతూరు, యర్రబల్లిపాళెం చెరువుల నుంచి పెద్ద మొత్తంలో గ్రావెల్‌ను లేఅవుట్ల కోసం తరలిస్తున్నారు. కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెం, కమ్మవారిపాళెం, తదితర ప్రాంతాల్లో లేఅవుట్ల కోసం గ్రావెల్‌ను తరలిస్తున్నారు. వరికుంటపాడు మండలంలో పిల్లాపేరు బ్రిడ్జికి అతి సమీపంలో గ్రావెల్‌ను తరలిస్తుండటంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి వంతెన మనుగడ ప్రమాదకరంగా మారింది.



వింజమూరు పాతూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు



వరికుంటపాడు మండలంలో పిల్లాపేరు వంతెన సమీపంలో గ్రావెల్ తవ్వగా ఏర్పడిన గుంతలు

చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- కాకాణిపై రోజుకొక కేసు పెట్టడం దారుణం
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెంకటాచలం: చంద్రబాబు పాలనలో వైఎస్సార్‌సీపీ కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులను బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసుల కారణంగా వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి ములాఖత్ ద్వారా సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం నారాయణస్వామి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఏడాది పాలనంతా అభివృద్ధిని విస్మరించి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్నవారిపై కేసులు పెట్టి, వేధించడంతోనే సరిపోయిందన్నారు. ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా, నియంతృత్వ పోకడలతో పాలన సాగించడం సరైన పద్ధతి కాదన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రోజుకొక కొత్త కేసు పెడుతుండడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా మాట్లాడితే కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల మన్ననలు పొందకుండా వైఎస్సార్‌సీపీ నేతలను వేధింపులకు గురిచేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీని భూస్థాపితం చేస్తామని చెబుతున్నారని, కానీ భవిష్యత్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడకు వెళ్లినా ప్రజాదరణ తగ్గలేదని చెప్పారు. ఆయనకు వస్తున్న జనాదరణ చూసి కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తిరుగుబాటు చేసే పరిస్థితి వస్తుందనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుచుకోవాలన్నారు.



వెంగమాంబ, గురువయ్య దంపతుల గ్రామోత్సవం

వైభవంగా వెంగమాంబ గ్రామోత్సవం

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నర్రవాడలోని ఆలయంలో వెంగమాంబ, గురవయ్య దంపతులకు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రికి వెంగమాంబ పుట్టినిల్లు అయినా వడ్డిపాళెంలోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద వెంగమాంబ దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెం, తదితర గ్రామాల్లో గ్రామోత్సవం సాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కూడా అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

డీసీపల్లిలో 511 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 511 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 844 బేళ్లు రాగా, 511 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.180, సగటున రూ.239.34 ధర పలికిందని వివరించారు. వేలంలో ఎనిమిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

- ముంబై జాతీయ రహదారి మీదుగా చెన్నైకు రూ.కోట్లలో నగదు తరలింపు
- రోజుల వ్యవధిలోనే రెండు ఘటనలు
- ఒక కేసు విచారణలో ఉండగా మరో కేసు వెలుగులోకి
- అదుపులో అనుమానితులు
- రూ.6కోట్లకుపైగా నగదు స్వాధీనం?
- విచారణలో విస్తుగొలిపే అంశాలు

హవాలాకు అడ్డాగా నెల్లూరు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని మర్రిపాడు మండలంలో ముంబై జాతీయరహదారిపై రెండు రోజుల వ్యవధిలో రెండు కార్లలో కోట్ల రూపాయల నగదు పట్టుబడడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఓ కేసు విచారణలో ఉండగా మరో కేసు వెలుగులోకి వచ్చింది. దీనిని బట్టి చూస్తే హవాలాసొమ్ము తరలింపునకు నెల్లూరు జిల్లా అడ్డాగా మారిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు కేసులను ఛేదించేందుకు పోలీసులు రహస్య విచారణ సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే..గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఓ బడా వ్యాపారవేత్త రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఆయన తన వ్యాపార నిమిత్తం అవసరమైన రూ.4.5కోట్ల నగదును ఢిల్లీ నుంచి చెన్నైకు చేర్చాలని గుమస్తాకు సూచించారు. నగదును తీసుకెళ్లేందుకు వీలుగా సీట్ల కింద ప్రత్యేకంగా రూపొందించిన అరలు కలిగిన కారును సమకూర్చారు. కారుడ్రైవర్ కర్నూలు మీదుగా చెన్నైకు బయలుదేరారు. కారుకు జీపీఎస్ ఉండడంతో వ్యాపారి పర్యవేక్షిస్తూ వచ్చారు. మర్రిపాడు మండలం బాట, సింగనపల్లి వద్దకు రాగానే జీపీఎస్‌ను కట్‌చేసి నిందితులు నగదుతో ఉడాయించారు. జీపీఎస్ పనిచేయకపోవడం, కారుడ్రైవర్, గుమస్తా సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో వ్యాపారి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కారుడ్రైవర్, గుమస్తాతో సహా నలుగురు నిందితులను సింగనపల్లి అటవీప్రాంతం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మరో కారులో....

కేసును పూర్తిస్థాయిలో ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసు విచారిస్తున్న సమయంలోనే మరో కారును మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం పోలీసులు గుర్తించారు. కారును క్షుణ్ణంగా తనిఖీ చేయగా రూ.3కోట్లకు పైగా నగదు లభ్యమైనట్లుగా తెలుస్తోంది. దీంతో అసలు ఏం జరుగుతుందో తెలియక పోలీసులు నిర్ఘాంతపోయారు. ఈ రెండు కార్లు ఒకరివేనా? వేర్వేరు వ్యక్తులవా? అన్న కోణంలో దర్యాప్తు చేయగా రెండు వేర్వేరు వ్యక్తులవని తేలినట్లుగా తెలిసింది. రోజుల వ్యవధిలోనే ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడాన్ని బట్టి జిల్లా హవాలా సొమ్ము తరలింపునకు అడ్డాగా మారిందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రోజూ పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. అయినా ముంబై జాతీయరహదారిపై రూ.కోట్లతో నగదు తరలివెళుతున్నా పట్టుబడకపోవడం చూస్తే తనిఖీలు ఏపాటివో అవగతమవుతోంది.

లోతుగా విచారణ..

వరుస ఘటనల్లో పట్టుబడిన సొమ్ము వ్యాపార లావాదేవీలకు సంబంధించిందా లేక హవాలా సొమ్మా అన్న వివరాలు తెలియరావాల్సి ఉంది. దీంతో ప్రత్యేక బృందాలు లోతుగా విచారణ చేపట్టాయి. ఈ తరహా ఘటనలు ఇటీవల ఎక్కడెక్కడ చోటుచేసుకున్నాయి? వాటికి ఈ ఘటనలకు సంబంధాలు ఏమైనా ఉన్నాయా? వ్యాపారులు ఎవరు? వారు ఏయే వ్యాపారాలు చేస్తున్నారు? అన్న వివరాలను సేకరించి ఆ దిశగా విచారిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో చిన్నపాటి సమాచారం సైతం బయటకు పొక్కకుండా పోలీసు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికి రెండు, మూడురోజుల్లో పోలీసులు రెండు కేసుల్లో దర్యాప్తును పూర్తిచేసి వాస్తవాలను బహిర్గతం చేయనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

కాకాణి బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపు

నెల్లూరు(లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ నెల్లూరు ఐదో అదనపు జిల్లా జడ్జి (ప్రత్యేక ఎస్సీ ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి సరస్వతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవర్ధన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై పోలీసుల తరఫున స్పెషల్ పీపీ వాదనలు వినిపించాల్సి ఉంది. కాగా పీపీ అత్త మృతిచెందగా వాదనలను మరోరోజుకు వాయిదా వేయాలని కోరుతూ కేసులోని దర్యాప్తు అధికారి కోర్టులో మెమో దాఖలు చేశారు. దీంతో న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌పై వాదనల కొనసాగింపును బుధవారానికి వాయిదా వేశారు.

• గోవర్ధన్‌రెడ్డిపై ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో దాఖలు చేసిన యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ విచారణను ఈనెల 19వ తేదీకి వేయిదా వేస్తూ నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ – సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో కాకాణి దాఖలు చేసిన యాంటిసిపేటరీ బెయిల్ పిటిషన్ విచారణను ఈనెల 19కు వాయిదా వేస్తూ నెల్లూరు నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు ఉత్తర్వులిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన ఐఏఎస్ అధికారులు



కలెక్టర్‌తో ఐఏఎస్ అధికారులు

నెల్లూరు(అర్బన్): శిక్షణలో భాగంగా ఏపీ దర్శన్ కింద ఏడుగురు ఐఏఎస్ అధికారులు సోమవారం నెల్లూరుకు వచ్చారు. వీరు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ఆనంద్ వివరించారు. వీరికి ఉదయగిరి ఉడెన్‌తో చేసిన వస్తువులను బహూకరించారు. యువ ఐఏఎస్‌లు కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత

• టీడీపీ, జనసేన నేతల మధ్య వాగ్వాదం



పోలీసులు, టీడీపీ నాయకులతో జనసేన నాయకుల వాగ్వాదం

ఆత్మకూరు రూరల్: మండలంలోని వాశిలి చెరువుకట్టపై చికెన్ వ్యర్థాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ నాయకులు పట్టుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన నేతలు బండి అనిల్ రాయల్, డబ్బుకొట్టు నాగరాజు యాదవ్ తదితరులు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా చేపల పెంపకం చేసే చెరువుల్లో కర్ణాటక నుంచి వచ్చే చికెన్ వ్యర్థాలు వాడుతున్నారన్నారు. స్థానికంగా ఉన్న రాజకీయ నేతల ప్రోద్బలంతో ఈ తంతు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, డీఎస్పీ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వాశిలి గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో ఉన్న టీడీపీ, కూటమి నాయకుల ప్రమేయంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. చికెన్ వ్యర్థాల రవాణాకు అండగా ఉన్న టీడీపీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని జనసేన నేతలతో వాగ్వాదానికి దిగారు. రెండు వాహనాలను పట్టించడంపై మండిపడ్డారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థులే పనివాళ్లు

• పుస్తకాలు మోస్తున్న వైనం



ఏఎస్‌పేట మెయిన్ పాఠశాల నుంచి పుస్తకాలు మోస్తూ..

ఆత్మకూరు: విద్యార్థులను కూలీలుగా మార్చేసిన వైనమిది. మండల కేంద్రమైన అనుమసముద్రంపేట మెయిన్ పాఠశాలకు ఎంఈఓ నేతృత్వంలో పాఠ్యపుస్తకాలు వారంరోజుల క్రితం చేరాయి. తొలి రెండురోజులు పుస్తకాలను కొన్ని బడులకు ఎంఈఓ-2 నేతృత్వంలో సరఫరా చేశారు. ఇంకా మరికొన్నిచోట్లకు పుస్తకాలను సరఫరా చేసేందుకు సోమవారం గ్రామాల్లోని స్కూళ్ల ఉపాధ్యాయులు మండల కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులచే పుస్తకాలను మోటార్‌బైక్ వరకు మోయించారు. దీనిని చూసిన పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయమై డిప్యూటీ డీఈఓ ఎస్వీ జానకీరామ్‌ను సంప్రదించగా తనకు ఇప్పుడే సమాచారం తెలిసిందని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం..

కనికరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

• అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిట

నెల్లూరు(అర్బన్): సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో అధికారులు తిప్పుకొంటున్నారు. కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడం లేదు. నెల్లూరు కలెక్టరేట్‌కు వస్తే మళ్లీ మండలాధికారుల వద్దకే పంపుతున్నారు. వారు మళ్లీ మళ్లీ తిప్పుకొంటున్నారు. మీరైనా దయచూపి సమస్యలను తీర్చాలని బాధితులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి నాగశేఖర్ తదితరులు అర్జీలు స్వీకరించారు. 398 మంది ఆన్‌లైన్ అర్జీలను, మరో 40 మంది ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

తల్లికి వందనం పథకం కోసం..

కార్పొరేషన్‌తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో పని చేస్తున్న 2,500 మంది పారిశుధ్య, ఇంజినీరింగ్, ఏఎంఆర్ కార్మికులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. వీరంతా వివిధ సొసైటీలు, ఆప్కాస్ కింద కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ పద్ధతిలో అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. ఎలాంటి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయకపోవడం దారుణం. అలాగే 8 నెలలుగా పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న విధంగానే ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం రూ.21 వేల నుంచి రూ.24 వేల వరకు జీతం చెల్లించాలి. తల్లికి వందనంతోపాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

– నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, పెంచలనరసయ్య, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు, నెల్లూరు



పొలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారు



మానాన్న కాలం నాటి నుంచి గ్రామంలోని ప్రభుత్వ శివాయి భూమి 2.50 ఎకరాలు మా సాగుబడిలో ఉంది. అప్పట్లోనే భూమి చదును, బాగు కోసం రూ.50 వేలు, మోటార్‌కు, బోరుబావికి మరో రూ.లక్ష ఖర్చు చేశాం. 30 ఏళ్ల నుంచి ఉలవలు, జామాయిల్ లాంటి పంటలు పండించాం. 17 ఏళ్ల నుంచి మామిడి తోట వేశాం. ప్రభుత్వ రీసర్వేలో సైతం సాగుబడి కింద మా పేర్లు నమోదు చేశారు. ఇటీవల వెలిచర్ల అంకమ్మ, వారి కుటుంబ సభ్యులు ఆ భూములు తమవంటూ దౌర్జన్యం చేస్తున్నారు. దీంతో తమ భూములను 10 – 1 అడంగళ్‌లో ఎక్కించి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని కలెక్టరేట్‌లో సంవత్సరం క్రితం అర్జీ ఇచ్చాను. కలెక్టర్ ఆ అర్జీని ఆర్డీఓకు పంపారు. ఆయన తిప్పుకొన్నారు. ఇప్పుడు బదిలీ అయ్యారు. నా భూమికి పాస్ పుస్తకాలు ఇప్పించాలంటూ ఇప్పటికే మూడు దఫాలు కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలిచ్చాం. సమస్యకు పరిష్కారం చూపాలి.

– చీదర్ల మాల్యాద్రి, లక్ష్మీకాంతమ్మ, కేశవరం గ్రామం, జలదంకి మండలం

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలో దివ్యాంగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఇంటి వద్దకే రేషన్ రావకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ డోర్ డెలివరీ చేయించాలి. నడవలేని వారికి ఉపకరణాలు ఇచ్చేందుకు వెంకటాచలంలోని ఆల్మికో సంస్థ వద్దకు వెళ్లాలని కలెక్టర్ చెప్పడం అన్యాయం. మాకు దివ్యాంగుల శాఖ ఉంది. దాని ద్వారా గతంలోలానే ఉపకరణాలు ఇప్పించాలి. రెండేళ్లకు సంబంధించి దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి. తమకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలి. నకిలీ దివ్యాంగుల కోటాతో ఉద్యోగాలు పొందుతున్న వారి సర్టిఫికెట్లను కూడా రీ వెరిఫికేషన్ చేయించాలి. తమ సమస్యల పరిష్కారం కోసం దివ్యాంగులతో కూడిన (డీఎల్‌సీ) జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలి.

– ఆవుల నాగేంద్ర, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, వెంకటరమణయ్య, చిట్టికుమార్, కాలేషాబాషా, సుజాత

విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారు



జిల్లాలో మాంటిస్సోరి, శాటిలైట్ ఫౌండేషన్‌ల పేరుతోనో.. మరొక పేరుతోనో ఎల్‌కేజీ, యూకేజీ లాంటి ప్రీ ప్రైమరీ పాఠశాలలు 500 వరకు ఉన్నాయి. వాటిలో కేవలం ఏడు మాత్రమే విద్యాశాఖ గుర్తింపు పొందాయి. మిగతావాటిని గుర్తింపు లేకుండా అక్రమంగా నడుపుతున్నారు. విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. అదనపు గంటలతో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. సమాచార హక్కు చట్టంతో ఆధారాలు తీసుకుని సమర్పిస్తున్నాం. పిల్లలను శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారు. దీనిపై చర్యలు చేపట్టాలి.

– శిఖరం నరహరి, కోట శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్ యాదవ్, శ్రీనివాసరావు, పేరెంట్స్ అసోసియేషన్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం



బాధితురాలి సమస్యను వింటున్న డీఎస్పీ

• ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): చిత్తూరుకు చెందిన స్వరూప్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.40 లక్షలు తీసుకుని మోసగించారని దగదర్తి పరిసర ప్రాంతాలకు చెందిన 23 మంది బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అతడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 70 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావుకు అందజేశారు. వినతులను పరిశీలించిన ఆయన చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ- 2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

• కోవూరుకు చెందిన రోహిత్ నా కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6 లక్షలు తీసుకుని మోసగించాడని కోవూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

• నా భర్త మరణానంతరం చిన్నకుమారుడు, కోడలు తిడుతూ ఇబ్బందులు పెడుతున్నారు. కౌలు డబ్బులు, ఇంటి కాగితాలు తీసుకుని నా బాగోగులను పట్టించుకోవడం లేదు. విచారించి న్యాయం చేయాలని కావలి రూరల్ పరిధికి చెందిన ఓ మహిళ కోరారు.

• చెడు అలవాట్లకు బానిసైన నా భర్త నా పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. నాతోపాటు నా పిల్లల బాగోగులను పట్టించుకోవడం లేదు. కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాన్ని చక్కదిద్దాలని నవాబుపేటకు చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.

• నా భర్త మరణించాడు. ఇందుకూరుపేటకు చెందిన ఎ.శీనయ్య నన్ను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నాడు. అసభ్యంగా తిడుతూ వేధిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ విజ్ఞప్తి చేశారు.

• నా తమ్ముడు కొంతకాలం కిందట తప్పిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసినా ఇంత వరకూ ఆచూకీ తెలియజేయలేదు. తగిన చర్యలు తీసుకోవాలని వేదాయపాళెనికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.

కండలేరులో 36.689 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 36.689 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,420, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎంపీపీపై చర్యలు చేపట్టాలంటూ..

• కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఆత్మకూరులో శిథిలావస్థకు చేరిన పూర్వపు ఎంపీడీఓ కార్యాలయం కూల్చివేత సందర్భంగా అక్రమంగా టేకు తదితర ఖరీదైన కలపను తరలించిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) కేతా వేణుగోపాల్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నేతలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, బోలిగర్ల వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనాన్ని ఇటీవల రూ.1.68 లక్షలు ఖర్చుతో అధికారులు కూల్చివేయించారన్నారు. అందులో ఉన్న ఖరీదైన కలపను వేణుగోపాల్‌రెడ్డి అధికారుల అనుమతి లేకుండానే తన స్వగ్రామమైన చెర్లోయడపల్లికి తరలించాడన్నారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో తాము ఎంపీడీఓను ప్రశ్నించామన్నారు. దీంతో ఎంపీపీ గత సర్వసభ్య సమావేశంలో అనుమతి పొందారంటూనే కలప తన పరిధిలోనిది కాదని పంచాయతీరాజ్ ఏఈ పరిధిలోకి వస్తుందని తెలిపారన్నారు. దీనిపై మళ్లీ కథనాలు రావడంతో ఎంపీపీ కలపను ఈనెల 7వ తేదీన ఎంపీడీఓ కార్యాలయానికి తిరిగి చేర్చారన్నారు. అందులో ఖరీదైన 70 శాతం కలప మాయమైందని, 30 శాతం మాత్రమే తిప్పి పంపారన్నారు. ఈ కొంచెం కలపను ఈనెల 18న వేలానికి పెడుతున్నట్లు అధికారులు తెలిపారన్నారు. కలెక్టర్ స్పందించి మిగతా 70 శాతం కలపను రికవరీ చేయించాలని, అక్రమంగా తరలించిన ఎంపీపీపై, సహకరించిన ఎంపీడీఓ, పంచాయతీరాజ్ ఏఈపై చర్యలు చేపట్టాలని, వాస్తవాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. దీనికి ఆనంద్ సానుకూలంగా స్పందించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.32
సన్నవి : రూ.25
పండ్లు : రూ.10

ఇళ్ల నిర్మాణంపై ప్రతి వారం సమీక్షలు

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ, డీఆర్వో తదితరులు

నెల్లూరు(అర్బన్) : ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, స్పెషలాఫీసర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు పొందుతున్న ప్రజల అభిప్రాయాలను సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రతి వారం కనీసం 70 శాతం పనులు తగ్గకుండా చూడాలన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఆధార్‌కార్డులు అందేలా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కార్పొరేషన్ కమిషనర్ నందన్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్‌రావు, గంగాభవాని, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రి



ప్లాస్టిక్ కవర్లో ఉన్న పేలుడు సామగ్రి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి దుర్గంపై పేలుడు సామగ్రిని కొంతమంది యువకులు గుర్తించారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నా యి. ఉదయగిరి పట్టణానికి చెందిన యువకులు శనివారం రాత్రి దుర్గంపై ఉన్న పెద్ద మసీదు వద్దకు నిద్రించేందుకు వెళ్లారు. వారు మసీదు వద్దకు వెళ్తున్న సమయంలో రామ్, కరీం బుగ్గ ప్రాంతంలో దీపాల వెలుతురు రావడం, వ్యక్తులు ఆ ప్రాంతంలో సంచరిస్తుండడాన్ని గమనించారు. ఆ సమయంలో అక్కడికి వెళ్లేందుకు యువకులు భయపడ్డారు. ఆదివారం తిరిగి ఇళ్లకు బయలుదేరారు. వచ్చే సమయంలో శనివారం రాత్రి దీపాలు వెలుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్లో పేలుడు సామగ్రి, భోజనం చేసే ప్లేట్లు తదితరాలను గుర్తించారు. రాత్రి ఆ ప్రాంతంలో ఉన్నది గుప్తనిధుల ముఠాయేనని నిర్ధారించుకుని అక్కడి నుంచి కిందకు పరుగులు తీశారు. గతంలో కూడా దుర్గం కొండపై గుప్తనిధుల తవ్వకాలు జరిపే సమయంలో పేలుడు సంభవించి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతిచెందాడు.

ఎస్ఆర్ పురం హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): హౌసింగ్ కార్పొరేషన్ సీతారామపురం మండల ఏఈగా పనిచేస్తున్న కరిముల్లాను సోమవారం రాత్రి కలెక్టర్ ఆనంద్ సస్పెండ్ చేశారు. ఆయన సంగం మండలంలో సిమెంట్ గోదాము ఇన్‌చార్జిగా పని చేస్తున్నప్పుడు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 708 సిమెంట్ బస్తాలు గల్లంతయినట్టు లెక్క తేలింది. దీంతో ఆయన్ను గతంలోనే సస్పెండ్ చేశారు. అయితే అధికార పార్టీ నేతల అండతో రెండు, మూడు నెలల్లోనే సీతారామపురం మండల ఇన్‌ఛార్జి ఏఈగా నియమించారు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం అక్కడ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలిసింది. మద్యం తాగి ఇబ్బందికరంగా వ్యవహరించినట్టు ప్రచారం జరుగుతోంది. విచారణ చేసిన అధికారులు కలెక్టర్‌కు ఫైలు పంపగా ఆయన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.